క్లుప్తంగా

ఆస్పత్రి నుంచి పరీక్షకు హాజరు



జడ్చర్ల టౌన్: అపెండిక్స్ ఆపరేషన్ చేయించుకుని ఆస్పత్రి నుంచి వచ్చి పదో తరగతి పరీక్ష రాసి శభాష్ అనిపించుకున్నాడు మండలంలోని ఎక్వాయపల్లికి చెందిన పోలం శివ అనే విద్యార్థి. మండలంలోని పెద్ద ఆదిరాల జెడ్పీ హైస్కూల్‌లో చదివి కోడ్గల్ పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాస్తున్న శివ గురువారం కడుపునొప్పితో బాధపడుతుండగా, కుటుంబ సభ్యులు ఏనుగొండ సమీపంలోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ అపెండిక్స్ నిర్ధారణ చేసి అదేరోజున ఆపరేషన్ చేసి ఐసీయూలో ఉంచారు. పరీక్ష రాయాలనే సంకల్పంతో విద్యార్థి ఉపాధ్యాయులకు సమాచారం అందించటంతో శుక్రవారం ఉదయం ఉపాధ్యాయుడు తాహెర్ తన కారులో ఎస్‌వీఎస్ నుంచి కోడ్గల్ పరీక్ష కేంద్రానికి విద్యార్థిని తీసుకువచ్చి పరీక్ష రాశాక తిరిగి ఆస్పత్రిలో చేర్పించి వచ్చారు.

ఇంటింటికీ కరపత్రాల పంపిణీ

జడ్చర్ల: మండలంలోని కిష్టారంలో శనివారం హాథ్ సే హాథ్ జోడోయాత్రలో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పాల్గొని ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు మినాజ్, శ్రీను, నిఖిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న వాలీబాల్ జిల్లా స్థాయి పోటీలను శనివారం జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 30జట్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చేతన, సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో బెల్టుల ప్రదానం

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం, ఆలూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గంగాపురం హైస్కూల్‌లో మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో మాస్టర్ కేశవ్ 23మంది విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. విద్యార్థులు చేసిన కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆలూరులో కరాటే మాస్టర్ జాకీర్ ఆధ్వర్యంలో రెండు నెలలుగా విద్యార్థులకు ఇస్తున్న కరాటే శిక్షణ శనివారం ముగిసింది. కార్యక్రమంలో హెచ్‌ఎం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జడ్చర్ల: మండలంలోని దుందుభీ వాగు నుంచి జడ్చర్లకు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. శనివారం గంగాపూర్ శివారులో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ నేనావత్ భాస్కర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు



గండీడ్: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెల్పిన వివరాల ప్రకారం.. మండలంలోని అంచన్‌పల్లికి చెందిన చిన్న హన్మంతు గ్రామం నుంచి బైక్‌పై గండీడ్ వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో వెన్నాచేడ్‌కు చెందిన దిడ్డి చెన్నయ్య బైకుపై ఎదురుగా వస్తుండా, ప్రమాదవశాత్తు రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో హన్మంతు కాలు విరిగిపోగా, చెన్నయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. 108కు సమాచారం అందించగా, మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పందుల సంచారంతో ఇబ్బందులు

మహమ్మదాబాద్: పందుల సంచారంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలో కొందరు వ్యాపారులు పందులను పెంచుకుని గ్రామంలో వదిలి పెడుతున్నారన్నారు. విద్యుత్ ఎర్తింగ్ తీగల వద్ద గుంతలు తవ్వుతూ వైర్లను కొరికేస్తున్నాయని తెలిపారు. ఈవిషయమై పలుమార్లు వ్యాపారులకు తెలిపినా ఫలితం లేకపోయిందని అన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో లైన్‌మెన్ ఎల్లయ్య, రైతులు శేఖర్, సూరి, వార్డు మెంబర్ శ్రీను, కుర్వకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం

- గిర్నీగడ్డ, వాటర్‌ట్యాంకు చుట్టుపక్కల 5ఫీట్ల రోడ్లే దిక్కు
- హనుమాన్‌పురలో డ్రెయినేజీ ధ్వంసం

వార్డు 12
జనాభా 6,394
ప్రధాన వీధులు:
హనుమాన్‌పుర, జములమ్మనగర్, హబీబ్‌నగర్ (కొంత భాగం), గిర్నీగడ్డ, బండమీదిపల్లి (కొంత భాగం).



హబీబ్‌నగర్ చివరన కొత్తకాలనీలో ఇళ్ల మధ్యే నిలిచిన మురుగు



హబీబ్‌నగర్‌లో నిర్మించని డ్రైయినేజీ, సీసీరోడ్డు



జములమ్మనగర్‌లో మట్టిరోడ్డే శరణ్యం



హబీబ్‌నగర్‌లోని ఓ గల్లీలో రోడ్డుపైనే నిలిచిన మురుగు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఇమామ్‌సాబ్ కుంట ఇవతల గల ప్రాంతం మొత్తం 12వ వార్డు పరిధిలోకి వస్తుంది. హబీబ్ నగర్ చివరన పెద్ద రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ వీధిలో పలుచోట్ల డ్రెయినేజీ, సీసీరోడ్లు నిర్మించాల్సి ఉంది. సమీపంలో కొత్త కాలనీ వెలిసింది. గిర్నీగడ్డ, ఓవర్‌హెడ్ ట్యాంకు చుట్టుపక్కల చిన్న చిన్న గల్లీలలో కనీసం పైకి పెద్ద వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. అంతా ఎగుడు దిగుడుగా గజిబిజిగా ఉంటుంది. ఇళ్ల మధ్య కనీసం 10ఫీట్ల రోడ్డు కూడా కనిపించదు. జములమ్మనగర్‌లో కొన్ని చోట్ల ఇంకా మట్టిరోడ్లే ఉన్నాయి. హనుమాన్‌పురలో మెయిన్ రోడ్డుపై ఎడమ వైపు (సోఫియా మసీదు నుంచి హనుమాన్ టెంపుల్ వరకు) డ్రెయినేజీ ఎక్కడికక్కడ ధ్వంసమైంది. 2008లో విస్తరణ భాగంగా నిర్మించిన ఈ మురుగు కాల్వ దెబ్బతింది. దీన్ని పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే చోట పెద్ద మలుపు ఉండటంతో ఎదురుగా ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, జంక్షన్‌లో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని పేర్కొంటున్నారు.

అధ్వానంగా రోడ్డు..



వార్డు చివరన ఉన్న మా కాలనీలో పెద్ద రోడ్డు అధ్వానంగా తయారైంది. మా వీధిలో మోరీలు, సీసీరోడ్లు నిర్మించలేదు. మురుగు ఎక్కడికక్కడ నిలిచి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. తరచూ చిన్నపిల్లలు రోగాల బారిన పడుతున్నారు. డెంగీ, మలేరియా, విషజ్వరాలు సోకడంతో ఆస్పత్రి పాలవుతున్నారు. వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. కౌన్సిలర్, మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
– షేక్ హబీబ్, హబీబ్‌నగర్

ఎప్పుడు ఏమవుతుందో తెలియదు..



మెయిన్‌రోడ్డుపై ఎడమ వైపు సోఫియా మసీదు నుంచి ఆంజనేయస్వామి టెంపుల్ వరకు డ్రెయినేజీ ధ్వంసమైంది. విస్తరణలో భాగంగా 2008లో నిర్మించారు. ఎలుకలు, పందికొక్కులు ఆవాసం ఏర్పరచుకుని బొరియలు పెట్టి తొడేస్తున్నాయి. ఈ ప్రాంతంలో పెద్ద మలుపు ఉండటంతో రాత్రివేళ ఎప్పుడు ఏ వాహనం ఎదురై ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. జంక్షన్‌లో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.
– ఎస్.రామాంజనేయులు, హనుమాన్‌పుర

రూ.2కోట్ల పనులు చేపట్టాం..



ఈ మూడేళ్ల కాలంలో సుమారు రూ.రెండు కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. అక్కడక్కడా కొన్ని పనులు మిగిలి ఉన్నాయి. నిధులు మంజూరైతే పూర్తి చేయిస్తాం. ఇమామ్‌సాబ్ కుంట సమీపంలో కొత్త కాలనీ వెలిసింది. ఇక్కడ జోరుగా ఇళ్ల నిర్మాణం కొనసాగుతోంది. టిప్పర్లు, ఇతర పెద్ద వాహనాలు గల్లీలలోకి రావడంతో సీసీ రోడ్లు దెబ్బతింటున్నాయి. వివిధ రోడ్ల మధ్యలో ఉన్న 78 విద్యుత్ స్తంభాలను తొలగించాం. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించాం.
– ఉమర్ పాషా, కౌన్సిలర్, 12వ వార్డు

సోదరభావంతో మెలగాలి



ఎంఐఎం ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందులో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రం వీరన్నపేటలోని హెచ్‌ఎన్ ఫంక్షన్‌హాల్‌లో ఎంఐఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొన్నారు. ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించారు. రంజాన్ మాస విశిష్టతను మంత్రి కొనియాడారు. సర్వమత సారం ఒక్కటేనని, మనుషులంతా సోదరభావంతో ఉండాలని కోరారు. అదేవిధంగా పాతతోటలో బీఆర్‌ఎస్ నాయకుడు చిన్న, బోయపల్లిలో బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుల్లో కూడా మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహెమత్‌బేగ్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జాబిర్ బిన్ సయీద్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్ పాల్గొన్నారు.

తొలగింపు ఉత్తర్వులు నిలిపివేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కమలాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి హిందీ పరీక్ష పేపర్ బయటకు వచ్చిన సంఘటనలో స్కూల్ అసిస్టెంట్ సబియా మదాహత్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఉత్తర్వులు నిలిపి వేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) జిల్లా నాయకులు జి.ఆదిత్య, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేష్, కె.రవికుమార్, మహమూద్, నవీన్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎలాంటి విచారణ జరపకుండా ఉపాధ్యాయులపై చర్య తీసుకోవడం తగదన్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం నిర్వహించిన రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. స్థానిక కల్వరి ఎంబీ చర్చి మైదానంలో ప్రారంభమైన ఈ రన్ పాతబస్టాండ్, క్లాక్‌టవర్, అశోక్‌టాకీస్ చౌరస్తా, అంబేడ్కర్, ఆర్టీసీ బస్టాండ్, న్యూటౌన్, రైల్వే స్టేషన్ చౌరస్తా, ఎర్రసత్యం, తెలంగాణ చౌరస్తాల మీదుగా తిరిగి ఎంబీ చర్చి వరకు చేపట్టారు. ఎంబీసీ చైర్మన్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు శాంతిదూతయని, ప్రేమను పంచడమే ఆయన సందేశమని అన్నారు. కీస్తు బోధనలు మానవాళికి ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో పాస్టర్ బీఎస్ పరంజ్యోతి, నందకిరణ్, సంఘ కాపర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం



నవాబుపేట: మండలంలోని భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, సర్పంచ్ గోపాల్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు మండల కేంద్రంలో కార్యాలయం నిర్మించుకునేందుకు సహకరిస్తామని తెలిపారు. ఇళ్లు లేని కార్మికులు ఉంటే వారికి ప్రభుత్వపరంగా చేయూతనిస్తామని అన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడిగా రంగయ్య, ప్రధాన కార్యదర్శిగా గోవింద్‌నాయక్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో శ్రీనివాస్, వెంకటేష్, రాములు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: కార్మికులకు అండగా ప్రభుత్వం ఉంటుందని మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ కార్యాలయాన్ని ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డితో కలిసి చైర్మన్ బస్వరాజ్ గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, నాయకులు నారాయణ గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, నర్సింహులు, యాదయ్య, రామ్మోహన్, తిరుపతయ్య పాల్గొన్నారు.

నిందితుల రిమాండ్

నవాబుపేట: ఈనెల 4న మండలంలోని కిషన్‌గూడ గ్రామానికి చెందిన మహిళపై లైంగిక దాడికి పాల్పడి వెండి కడియాలు చోరీ చేసిన సంఘటనలో శనివారం నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. ఈ సంఘటనలో పోమాల్‌కు చెందిన గణేష్, లోకిరేవుకు చెందిన మహేష్‌లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని ఆయన పేర్కొన్నారు.

ఏకపక్షంగా కమిటీ ఎన్నిక చెల్లదు



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి

మహబూబ్‌నగర్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాలల స్ఫూర్తి భవన నిర్మాణ కమిటీని ఏకపక్షంగా ఎన్నుకున్నారని, అన్ని మాల సంఘాల అభిప్రాయాలతో నూతన కమిటీని ఎన్నుకోవాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి అన్నారు. శనివారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు జి.చిన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ మాలల స్ఫూర్తి భవన నిర్మాణం కోసం క్రిష్టియన్‌పల్లి శివారులోని 523 సర్వేనంబర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెయ్యి చదరపు గజాల స్థలాన్ని కేటాయించి అన్ని సంఘాలతో కలిసి ఒక కమిటీ వేసుకొని భవన నిర్మాణం చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. ఒకటి, రెండు సంఘాల నాయకులు మాత్రమే అన్ని సంఘాల ప్రమేయం లేకుండా నియంతృత్వ పోకడలతో కమిటీని ఎన్నుకున్నారని అన్నారు. అంతేకాకుండా కమిటీ చైర్మన్ నేనే అంటూ తనకు తానే ప్రకటించుకున్న మంత్రి నర్సింహయ్య నిర్ణయం సరైంది కాదన్నారు. అన్ని మాల సంఘాల నాయకులతో కలిసి అందరి సమక్షంలో కమిటీని ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఇట్టి విషయాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకపోతామని అన్నారు. సమావేశంలో మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అరేందర్, నాయకులు శ్రీనివాసులు, ఆంజనేయులు, రవికుమార్, వెంకటేష్, ఆనంద్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయరా?



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: లాభాల బాటలో పయనిస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ బడా కార్పొరేట్ ప్రైవేట్ వ్యాపార తిమింగలాలకు కారు చౌకగా అమ్మేసే నరేంద్ర మోదీ గో బ్యాక్ అంటూ శనివారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ మాట్లాడుతూ విభజన హామీలను నెరవేర్చకుండా తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ గడ్డపై కాలు మోపే అధికారం లేదని అన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పిస్తామని హామీ ఇచ్చి ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. మోదీ పర్యటన కేవలం రాజకీయ లబ్ధి కోసమే చేస్తున్నారని, ఆయన పర్యటనలో తెలంగాణ ప్రజలకు ఒరిగేదేమీ లేదని అన్నారు. సింగరేణి లాంటి అనేక సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ కనబరుస్తూ బడ్జెట్ కేటాయింపుల్లో, నిధుల మంజూరులో, విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని అన్నారు. ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న తెలంగాణ లాంటి అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అస్థిరపరుస్తూ కూల దోచేందుకు శతవిధాలా యత్నిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్, రాము, నాయకులు బీఆర్ విల్సన్, అమరజ్యోతి, శ్రీను, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సి.రాజు పాల్గొన్నారు.

ప్రధాని సభకు తరలిన నాయకులు



హైదరాబాద్ తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

పాలమూరు: హైదరాబాద్‌లో శనివారం ప్రధాని నరేంద్ర మోదీ సభకు జిల్లా నుంచి బీజేపీ శ్రేణులు శనివారం తరలివెళ్లారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ తరలివెళ్లారు.

భూత్పూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో జరిగే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం అనంతరం జరిగే సభకు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రవీందర్, నాయకులు హరినాథ్ గౌడ్, లక్ష్మారెడ్డి, శ్రీను, శివలింగం, చంద్రశేఖర్, నరేష్‌చారి, కుర్మయ్య, పరమేశ్వర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మిడ్జిల్: హైదరాబాద్‌లో ప్రధాని నరేంద్రమోదీ పర్యటనకు మండల బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో మండల అధ్యక్షుడు నరేందర్, నాయకులు తిరుపతి, రవీందర్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, అంజి, శేఖర్, అరవింద్, మహేందర్ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగుల సమస్యలపై పోరాటం



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

జడ్చర్ల టౌన్: నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాలపై శనివారం శంకరాయపల్లి గేట్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం ఎదురుగా వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కో–ఆర్డినేటర్ బీస మరియమ్మ మాట్లాడుతూ బిస్వాల్ కమిటీ ప్రకారం వెంటనే లక్షా 91వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని, టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల కుంభకోణంలో దోషులను కఠినంగా శిక్షించాలని, పరీక్షలు తిరిగి నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నాయకులు బాల్‌రాజ్, నవీన్, ఆశన్న, మధు, మోహన్, ఆంజనేయులు, రాజు, శ్రీను, వెంకటేశ్, రాములు పాల్గొన్నారు.

మహనీయుల మాసంగా ప్రకటించాలి

జడ్చర్ల టౌన్: ఏప్రిల్ మాసాన్ని మహనీయుల మాసంగా ప్రకటించాలని పూలే అంబేద్కర్ 3వ జాతర ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బోయపల్లి నర్సింహులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పూలే అంబేడ్కర్ జాతరకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. 29న జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానంలో నిర్వహించనున్న జాతరకు ప్రముఖులు, వాగ్గేయకారులు హాజరవుతారని, ఆటాపాట ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జాతర నిర్వహణ కార్యనిర్వహణ అధ్యక్షుడు సామేల్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, నాయకులు గువ్వల లక్ష్మణ్, తుంగ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ సుధాశ్రీ

మహబూబ్‌నగర్ రూరల్: నియోజకవర్గ అభివృద్ధి బీఆర్‌ఎస్ హయాంలోనే సాధ్యమైందని ఎంపీపీ సుధాశ్రీ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు, అర్హులందరికీ పెన్షన్లు, దళితబంధు ద్వారా ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. 32 డబుల్ బెడ్రూం ఇళ్లు, రూ.85లక్షలతో సీసీరోడ్లు, రైతువేదిక వంటిని నిర్మించామని అన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని, మన్యంకొండలో రోప్‌వే ఏర్పాటు కాబోతుందని, అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ నాయకులు తమ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని, మంత్రిని కించపరిచేలా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచ్ చంద్రకళ, నాయకులు రాఘవేందర్‌గౌడ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ

మిడ్జిల్: విద్యార్థులు రాజకీయాలపై అవగాహన కలిగి ఉండాలని జెడ్పీటీసీ శశిరేఖ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్లేట్ గ్రామర్ పాఠశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు నేటి భారతబావి పౌరులని, దేశ భవిష్యత్ మీ చేతుల్లో ఉందని, సమాజంపై, రాజకీయాలపై అవగాహన ఉంటే నాయకులను ఎన్నుకునే అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం నిర్వహించిన పాదపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. తల్లిదండ్రులను గౌరవించిన వారు ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. సమావేశంలో సర్పంచ్ రాధిక, ఎంపీటీసీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



పాదపూజ నిర్వహిస్తున్న విద్యార్థులు